క్లుప్తంగా

ప్రతి ఒక్కరి అభివృద్ధి బీజేపీ లక్ష్యం



సుభాష్‌నగర్ డివిజన్‌లో సమస్యలను పరిశీలిస్తున్న మల్లారెడ్డి

సుభాష్‌నగర్: ప్రతి ఒక్కరి అభివృద్ధి బీజేపీ లక్ష్యమని పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం సుభాష్‌నగర్ డివిజన్‌లో ఆయన పాదయాత్ర చేపట్టారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు గారిగె శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎంఎస్ వాసు, డివిజన్ల అధ్యక్షులు కంది శ్రీరాములు, పులి బలరామ్, పత్తి సతీష్, అసెంబ్లీ ఓబీసీ మోర్చా కన్వీనర్ శ్రీధర్ వర్మ, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ సతీష్ రంగంపేట తదితరులు పాల్గొన్నారు.

మృతుడిని గుర్తిస్తే సమాచారం ఇవ్వండి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

జీడిమెట్ల: షాపూర్‌నగర్‌లోని రాజీవ్‌పార్కులో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని సెక్యూరిటీ గార్డు ఈనెల 9న పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించారు. కానీ ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వయసు (60 – 65 ఏళ్లు) ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే ఫోన్ నం.87126 63213, 94906 17220లో తెలపాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

చింతల్: కాంగ్రెస్ పార్టీ యువతకు పెద్దపీట వేస్తోందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. చింతల్ డివిజన్ వివేకానంద్‌నగర్‌కు చెందిన పండి, రాములు ఆధ్వర్యంలో పలువురు మంగళవారం హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. రాజు, ప్రకాష్, బాలకృష్ణ, కుమార్, సుజాత, సుమలత, జానకి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

కిక్కిరిస్తున్న తహసీల్దార్ కార్యాలయాలు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బీసీల కులవృత్తులు, చేతివృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించింది. దీంతో బీసీ కుల వృత్తిదారులు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాలకు పోటెత్తుతున్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏప్రిల్ 2021 నాటి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినా సరిపోతుందని మంత్రి గంగుల కమలాకర్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని కార్యాలయ ప్రాంగణంలో అతికించారు. అయినా చాలా మందికి సరైన అవగాహన లేకపోవడంతో దరఖాస్తుల కోసం పోటీపడ్డారు.



ఆటో హఠావో.. ఫ్రీ లెఫ్ట్ బచావో

రంగారెడ్డినగర్: ప్రధాన చౌరస్తాల్లో ఆటో డ్రైవర్లు తమ వాహనాలను నిలుపుతూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారు. ఐడీపీఎల్ చౌరస్తాలోని చింతల్ వైపు ఉన్న ఫ్రీ లెఫ్ట్‌లో నిత్యం ఆటోలను నిలుపుతున్నారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా షాపూర్‌నగర్ చౌరస్తాలోని గాజులరామారం వైపు వెళ్లే రోడ్డులోనూ ఫ్రీ లెఫ్ట్‌ను ఆటోవాలాలు ఆక్రమించేశారు. అక్కడే బస్టాప్ ఉండటంతో బసులు ఎక్కే, దిగే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



ఐడీపీఎల్ చౌరస్తాలో చింతల్ వైపు ఫ్రీ లెఫ్ట్‌లో ఇలా..



షాపూర్‌నగర్ చౌరస్తాలోని గాజులరామారం రోడ్డుపైనే ఆటోలను నిలిపిన డ్రైవర్లు

ప్రశ్నిస్తే ఎదురు దాడులు..

ఆటోలను ముందుకు నిలుపుకోవాలని ఎవరైన ప్రశ్నిస్తే ఆటో డ్రైవర్లు ఎదురు దాడులకు దిగుతున్నారు. దీంతో చేసేది లేక వాహనదారులు సర్దుకుపోతున్నారు. అక్కడే ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నా ఇష్టానుసారంగా ఆటోలను నిలుపుతున్నారు. ఫ్రీ లెఫ్ట్‌లను కాపాడి ట్రాఫిక్ జామ్‌లను నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

ఇతర వాహనదారులను ఆపి మరీ చలాన్లు విధించే ట్రాఫిక్ సిబ్బంది ఆటోవాలాల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన చౌరస్తాల్లో ఆటోలను నిలుపుతూ ఇబ్బందులు సృష్టిస్తున్న ఆటోవాలాలపై కఠినంగా వ్యవహరించాలని వాహనదారులు కోరుతున్నారు. పకడ్బందీ చర్యలు తీసుకుంటేనే ఇది సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు.

ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు..



ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా ఆటోలను నిలిపితే ఊరుకునే ప్రసక్తే లేదు. ఈ విషయంపై ఇప్పటికే ఫిర్యాదులు అందాయి. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ చేపడతాం. ఆటోవాలాలకు ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సిలింగ్ ఇస్తాం. అయినా తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు.
– వెంకట్‌రెడ్డి, జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్



నేడు గాజులరామారంలో బీజేపీ బహిరంగ సభ

- ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, బండి సంజయ్
- సభా ఏర్పాట్లను పర్యవేక్షించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అగ్రరాజ్యాలకు దీటుగా అభివృద్ధి సాధించిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గాజులరామారంలోని నూతన కార్యాలయంలో బుధవారం బహిరంగ సభను ఏర్పాటు చేశారు. బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ తరుణ్ ఛుగ్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో అగ్ర నాయకులు డాక్టర్ లక్ష్మణ్, డీకే అరుణ, విజయశాంతి, ఈటల రాజేందర్, మురళీధర్ రావు తదితరులు పాల్గొనున్న నేపథ్యంలో మంగళవారం బహిరంగ సభ ఏర్పాట్లను శ్రీశైలంగౌడ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు పున్నా రెడ్డి, కంది శ్రీరాములు, నాయకులు చండి శ్రీనివాస్, పత్తి రఘుపతి, బావిగడ్డ రవి, సునీల్ పాటిల్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నూతన కమిటీ సభ్యులతో అధ్యక్షుడు ఆకుల సతీష్ తదితరులు

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. కార్పొరేషన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మంగళవారం 23 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కుటుంబ, నిరంకుశ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగు చెందారన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ అభ్యర్థి విజయానికి ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని పని చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ప్రధాన కార్యదర్శిగా చెన్నారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, సెక్రటరీలుగా శేషారావు, సుధాకర్ రెడ్డి, నవ్య, అజయ్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఉదయ్, సురేష్, విజయ్ కుమార్, తిలోక్, లీగల్ సెల్ కన్వీనర్‌గా చలపతిరావు, లీగల్ సెల్ కో కన్వీనర్‌గా పురుషోత్తం రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా కవితా రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా విజయ్, సతీష్ కృష్ణ, వరప్రసాద్, సందీప్, అరుణ్‌రెడ్డి బాధ్యతుల చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రమౌళి, రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ అమలేశ్వరి, ప్రధాన కార్యదర్శి గొల్ల కృష్ణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన కుత్బుల్లాపూర్ కార్పొరేటర్

కుత్బుల్లాపూర్: నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మంగళవారం కుత్బుల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ గౌరీష్ పారిజత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.

కట్టమైసమ్మకు విశేష పూజలు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కమలాకర్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వివేక్‌రెడ్డి, శైలజ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: చింతల్ ద్వారకపురికాలనీలోని శ్రీవిరూపాక్షాదేవి, పోచమాంబ సహిత సూర్యమాంబ సమేత కంఠమేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ అంగరంగవైభవంగా ప్రారంభమైంది. మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర పూజలు నిర్వహించారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి



బాచుపల్లిలోని కళాశాల ఎదుట ఆందోళనకు దిగిన ఏఐఎస్ఎఫ్ నాయకులు, కుటుంబ సభ్యులు

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో జరుగుతున్న ఆత్మహత్యలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవడంలో ఇంటర్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. బాచుపల్లి నారాయణ కళాశాలలో విద్యార్థిని వంశిక ఆత్మహత్యను నిరసిస్తూ మంగళవారం కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టారు.

◆ ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. బాచుపల్లి నారాయణ కళాశాలలో విద్యార్థిని వంశిక ఆత్మహత్యకు ముమ్మాటికి కళాశాల యాజమాన్యానిదే బాధ్యతని అన్నారు. కళాశాల సీసీ పుటేజీని బయట పెట్టి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. విద్యా సంవత్సరం ఆరంభమై పది రోజులు గడవక ముందే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడటం శోచనీయమని అన్నారు.

◆ కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లే ఆత్మహత్యకు దారి తీశాయని ఆరోపించారు. కార్పొరేట్ కళాశాలల్లో చోటు చేసుకుంటున్న ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిన బాబు, శివ కుమార్, సందీప్ రెడ్డి, వరుణ్ పాల్గొన్నారు.

ఇదే స్ఫూర్తితో వినియోగదారులకు సేవలు అందించాలి

- టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి



మేడ్చల్ విద్యుత్ సర్కిల్ అధికారులకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న సీఎండీ రఘుమారెడ్డి

కుత్బుల్లాపూర్: వినియోగదారులకు నిరాటకంగా సేవలు అందించినప్పుడే నిజమైన గుర్తింపు లభిస్తుందని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి అన్నారు. మేడ్చల్ విద్యుత్ సర్కిల్ పరిధిలో మూడేళ్లుగా ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్న అధికారులను అభినందిస్తూ మంగళవారం ఆయన తన కార్యాలయంలో ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు సైతం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎస్ఈ శ్రీరామ్ మోహన్, మేడ్చల్ డీఈలు శ్రీనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి డీఈ చక్రవర్తి, జీడిమెట్ల డీఈ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల బియ్యం సీజ్



లారీని సీజ్ చేసిన పోలీసులు

దుండిగల్: భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని 40 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు మంగళవారం ఉదయం 9గంటల ప్రాంతంలో దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో కాపు కాశారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన (హెచ్ఆర్ 73ఏ 6557)లారీని ఆపి తనిఖీ చేయగా అందులో 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్‌ను ఈ విషయమై విచారించగా ఉస్మాన్‌పూర్ చాదర్‌ఘాట్‌కు చెందిన షేక్ నయీమ్, సూపర్‌వైజర్ వసీంలు తనకు బియ్యాన్ని తరలించేందుకు కిరాయి ఇచ్చారని వెల్లడించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించడం అభినందనీయం

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వ బీసీ కులవృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ మండల విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు బాలబ్రహ్మాచారి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈనెల 9 నుంచి 20వ తేది వరకు చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించిందన్నారు. అయితే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు సమయం సరిపోదన్నారు. ప్రభుత్వం మరో నెల రోజులు గడువు పొడిగించేలా జీవోను జారీ చేయాలని కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్‌చారి, బాలానగర్, మల్కాజ్‌గిరి మండలాల అధ్యక్షులు మల్లేష్‌చారి, చిరంజీవిచారి, రమేష్‌చారి, రాజుచారి పాల్గొన్నారు.

రసాయన ట్యాంకర్ల పరిశ్రమలో అగ్నిప్రమాదం

పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు



మంటలను ఆర్పుతున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది

జీడిమెట్ల: రసాయన ట్యాంకర్‌లకు మరమ్మతులు నిర్వహించే పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్లలో ఎండీ. అయూబ్ అనే వ్యక్తి ఎంఏ డెకరేషన్స్ పేరిట ట్యాంకర్లకు మరమ్మతులు నిర్వహించే పరిశ్రమ కొనసాగిస్తున్నాడు. మరమ్మతులు చేసే క్రమంలో వాటి నుంచి ప్లాస్టిక్ ఫైబర్‌ను వేరు చేస్తారు. అనంతరం పనికిరాని ఫైబర్‌ను పరిశ్రమలో ఓ మూలకు వేస్తారు. మంగళవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఫైబర్ స్క్రాప్ అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అక్కడే ఉన్న అజీమ్ అనే కార్మికుడు వెంటనే జీడిమెట్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న ఫైర్‌సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే కొన్ని ట్యాంకర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. పరిశ్రమ యాజమాన్యం అజాగ్రత్త వల్లే అగ్నిప్రమాదం చోటు చేసుకుందని జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తెలంగాణలో మహిళా సంక్షేమానికి పెద్దపీట

- మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం
- నియోజకవర్గంలో 10,777 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు
- 3962 మందికి కేసీఆర్ కిట్లు అందించాం
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



మహిళలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

సుభాష్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సాయం అందిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ×తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవ₹ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాజులరామారంలోని మహారాజ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు వివిధ పథకాల ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు.

మహిళలను ప్రోత్సహించడానికే వీ–హబ్..

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకూడదనే సదుద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం కింద లక్ష నూట పదహారు రూపాయలు అందిస్తున్నారని తెలిపారు. బాలికలు, మహిళల కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోందన్నారు. చిన్నారులు, కిశోరబాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. ఆడబిడ్డల విద్య కోసం ప్రత్యేకంగా గురుకులాలను ప్రభుత్వం స్థాపించిందన్నారు. మహిళలకు ఉద్యోగ అవకాశాలు, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే సంకల్పంతో అంకుర సంస్థలకు ప్రోత్సాహాన్ని కలిగించడం కోసం వీ–హబ్ ఏర్పాటు చేసిందన్నారు.

ఒంటరి మహిళలకు నెలకు రూ.2.41 కోట్లు ఇస్తున్నాం..

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గడిచిన తొమ్మిదేళ్లలో 10,777 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశామన్నారు. ఈ చెక్కుల విలువ రూ.102. 54 కోట్లు ఉంటుందన్నారు. 3962 మందికి రూ.5.94 కోట్లు వెచ్చించి కేసీఆర్ కిట్లు, ఒంటరి మహిళలు 1200 మందికి నెలకు రూ.2.41 కోట్లు ఇస్తున్నామన్నారు. ఇలా దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీలు మంగతాయారు, ప్రశాంతి, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి,మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా అధికారులు, సమైక్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, శానిటేషన్ వర్కర్లు, మహిళా ఉద్యోగులు, మహిళా వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.